
way2news®
#IndiaReadsWay2News
పేదలను కొట్టి
పెద్దలకు పెడుతున్నారు
SWIPE LEFT

భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే అత్యంత బలమైన పునాదులు గలది. ఈ కారణంగానే కరోనా వంటి విపత్తు నుంచి వేగంగా కోలుకుని గాడిలో పడింది.. ఇది కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కొద్ది నెలల క్రితం చెప్పిన మాటలు. ఇవి నిజమనేలా ప్రస్తుత GDP వృద్ధిరేటు ఉంది. $3.1 ట్రిలియన్లతో ప్రపంచంలో ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఉంది. అయితే ఈ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలిచే బ్యాంకుల పరిస్థితి దారుణంగా తయారవుతోంది. సమాజంలో పేరుమోసిన పెద్దోళ్లు పెడుతున్న పంగనామాలకు పేదోళ్ల రక్తం పిండాల్సిన పరిస్థితులేర్పడుతున్నాయి.

## దేశంలో అతిపెద్ద బ్యాంక్ స్కాం..


దేశంలో మరో బ్యాంకు మోసం బయటపడింది. యూనియన్ బ్యాంకు కన్సార్షియం నుంచి 2010-18 మధ్య DHFL రూ.42,871 కోట్లు తీసుకుని 2019 నుంచి రీపేమెంట్ చేయడం లేదు. యూనియన్ బ్యాంకు అనుమానంతో ఆడిట్ చేయించగా DHFLలో ఆర్థిక

అవకతవకలు, నిధులు పక్కదారి పట్టించడం వంటివి జరిగినట్లు గుర్తించి CBIకి కంప్లయింట్ చేసింది. రూ.34,615 కోట్ల చెల్లింపులకు సంబంధించి రంగంలోకి దిగిన దర్యాప్తు సంస్థ DHFLతో పాటు సంస్థ మాజీ ప్రమోటర్లు కపిల్, ధీరజ్‌లపైనా కేసు పెట్టింది. ఇది దేశంలో CBI దర్యాప్తు చేస్తున్న అతిపెద్ద బ్యాంకు స్కాంగా నిలిచింది.



ఇలాంటి స్కాంలు గతంలో ఎన్నో జరిగాయి. అందులో ఇటీవల కాలంలో దేశంలో సంచలనం రేపిన PNB స్కాం మనందరికీ ఇంకా గుర్తుంది. పెద్ద వ్యాపారవేత్తగా చెప్పుకుంటూ విదేశాల నుంచి ముత్యాలు దిగుమతి చేసుకుంటానంటూ.. ఫారిన్‌లో డమ్మీ కంపెనీల పేర్లతో పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి ఇతర బ్యాంకుల కోసం బ్యాంకు గ్యారంటీలు తీసుకుని వాటితో బ్యాంకులకు రూ.13వేల కోట్లకు పైగా ఎగనామం పెట్టి విదేశాలకు చెక్కేశారు నీరవ్ మోదీ, అతడి మామ మెహుల్ ఛోక్సీ. ఈ స్కాం బయటపడ్డాక హైదరాబాద్‌లో నీరవ్‌కు సంబంధించిన ఓ జ్యువెల్లరీలో అధికారులు తనిఖీ చేయగా అందులో ఉన్నవి అసలైన ముత్యాలు, వజ్రాలు కాదని.. అవి సిలికాన్‌తో తయారుచేసిన డమ్మీవని తేలింది. వందల రూపాయల విలువైనా చేయని ప్లాస్టిక్ ముక్కలను వేల, లక్షల రూపాయలకు

అమ్మి అటు కస్టమర్లనూ నీరవ్ మోసం చేశాడు.



నీరవ్ మోదీ, మెహుల్ ఛోక్సీ

దీనికి ముందు మనం విన్నది విజయ్ మాల్యా గురించి. కింగ్ ఫిషర్ బీర్‌లా బుస్సున పొంగిన మాల్యా వైభవం అదే స్థాయిలో అధపాతాళానికి చేరి అప్పుల్లో కూరుకునేలా చేసింది. 17 వేర్వేరు బ్యాంకుల వద్ద రూ.9 వేల కోట్ల అప్పులు చేసి చేతులెత్తేసి చెప్పా

పెట్టకుండా దేశం దాటేశాడు. ఆయన ఆస్తులను అమ్మి సొమ్ము చేసుకుందామనుకున్నా రూపాయి విలువను అర్ధరూపాయికి కొనేందుకు కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. లండన్ వీధుల్లో దర్జాగా తిరుగుతున్న మాల్యాను రప్పించేందుకు ఏళ్లుగా భారత ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఎంతకీ ఫలించడం లేదు.



విజయ్ మాల్యా

కేవలం ఈ రెండు కేసులే కాదు.. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి. దేశాన్ని $5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా చేస్తానని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. అయితే ఆశ్చర్యకరంగా.. దేశంలో గత ఏడేళ్లలోనే బ్యాంకుల మోసాల మొత్తం విలువ మాత్రం ఇప్పటికే రూ.5 ట్రిలియన్లు దాటింది. ఇక ప్రభుత్వరంగ బ్యాంకులు రూ.2.94 లక్షల కోట్ల మేర మోసపోగా ప్రైవేటు బ్యాంకులు రూ.86,355 కోట్లు నష్టపోయాయి. ఒక్క 2020-21లో జరిగిన ఫ్రాడ్ లోన్స్ మొత్తం విలువ రూ.1.37 లక్షల కోట్లు. 2021 మార్చి 31 లెక్కల ప్రకారం.. దేశంలో అతిపెద్ద బ్యాంకు SBI రూ.78,072 కోట్ల ఫ్రాడ్ లోన్స్ కలిగి ఉంది. అయితే ఇవన్నీ నరేంద్ర మోదీ ప్రభుత్వంలోనే జరిగాయన్నట్లు కాదు. దేశాన్ని ఎక్కువ కాలం పాలించిన కాంగ్రెస్ హయాంలోనూ బ్యాంకులను

మోసం చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి.

## బ్యాంకు నష్టంతో మనకే కష్టం

బ్యాంకులు అప్పులిచ్చాయి. వాళ్లే వసూలు చేసుకుంటారు. మనకెందుకులే అనుకుంటే పొరపాటే. ఎందుకంటే ఆ నష్టాలను బ్యాంకులు కస్టమర్ల నుంచే పూడ్చుకుంటాయి. డిపాజిట్లపై వడ్డీ తగ్గించడం, రుణాలపై వడ్డీ పెంచడం, ప్రాసెసింగ్ ఫీజు, సర్వీస్ ఛార్జ్, అకౌంట్ ఓపెనింగ్, క్లోజింగ్ ఛార్జ్, చెక్‌బుక్ ఛార్జ్.. ఇలా అనేక పేర్లతో కస్టమర్ల నుంచే లాగుతాయి.




పోనీ మనకు ఆ బ్యాంకులో ఖాతాలేదు కాబట్టి మనం అధికంగా ఏ ఛార్జీ చెల్లించడం లేదు అని మీరు అనుకుంటున్నారా? కానీ మీకు తెలియకుండానే మీరు బ్యాంకు అప్పుల భారాన్ని మోస్తున్నారు. అదెలాగంటే.. బ్యాంకులో అప్పు తీసుకుని షాపు పెట్టిన ఓ వ్యక్తి వచ్చే నెల నుంచి EMI పెరుగుతుంది అని తెలిస్తే.. తనకు ప్రతినెలా వచ్చే లాభం కంటే ఎక్కువ లాభం వస్తేనే ఈ భారం తట్టుకోవచ్చు అనుకుంటాడు. దీంతో తాను అమ్మే

వస్తువుల ధరలు పెంచుతాడు. ఫలితంగా మనం అధిక ధరకు వస్తువును కొనాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇలా కేవలం ఒక్క షాపుల విషయంలోనే కాదు రోడ్డు పక్కన పండ్లు, కూరగాయలు అమ్మేవారు మొదలుకుని ఆన్‌లైన్ ఆర్డర్లు డెలివరీ సేవలు అందించే కంపెనీల వరకు ప్రతి ఒక్కరూ ఆర్థిక భారాన్ని తమపై ఉంచుకోకుండా కస్టమర్లపై వేస్తారు. దీంతో అంతిమంగా, ఆర్థికంగా నష్టపోయేది సగటు పౌరుడే.

## పెద్దలకు రూల్స్ ఉండవా..?

ఒక రైతు సాగు కోసం రూ.10 వేల రుణం కావాలంటే.. పొలం కాగితాలు, సాక్షి సంతకం అంటూ తమ లోన్ బుక్‌లోని నిబంధనలన్నీ తప్పక పాటించి ఒకటికి రెండుసార్లు తిరిగితే కూడా లోన్ ఇస్తామని గ్యారంటీగా చెప్పలేని బ్యాంకర్లు.. సమాజంలో పెద్దమనిషిగా చెలామణీ అవుతున్న ఓ

వ్యక్తి వస్తే మాత్రం ఏసీ రూములో కూర్చోబెట్టి కూల్‌డ్రింకుతో మొదలుపెట్టి సపర్యలన్నీ చేసి 'దీనికి మీరెందుకు సార్ ఇక్కడకు రావడం' అంటూ కాగితాలేవీ అడగకుండా కౌంట్‌డౌన్ పెట్టుకుని మరీ క్యాష్ ట్రాన్స్‌ఫర్ చేసేస్తారు.

దేశానికి అన్నం పెట్టే రైతన్న కాలం కలిసిరాక ఒక నెల వాయిదా కట్టకపోతే అతడి ఇంటికొచ్చి తలుపులను సైతం తమ హక్కుగా తీసుకెళ్లే ఇదే బ్యాంకర్లు.. కోట్ల రూపాయలు ఎగ్గొట్టిన బడాబాబు తలుపు తట్టే ధైర్యమైనా చేయగలరా?

ఈ స్కాంలలో పాలకపక్షాల పాత్రే ఎక్కువగా కన్పిస్తోంది. తమకు అండగా నిలిచిన వారికి అడిగిన పని చేసిపెట్టమని ప్రభుత్వ పెద్దలు ఆదేశిస్తుంటే చేసేదేంలేక వారు చెప్పినట్లు బ్యాంకర్లు తలూపాల్సి వస్తోంది.

ఇక్కడ అంతిమంగా నష్టపోతోంది ఎవరు అంటే..
చేసిన చిన్నపాటి రుణం తీర్చేందుకు తెలిసిన వారి
దగ్గర అప్పో సొప్పో చేసి టైమ్‌కు వాయిదాలు కట్టే
నిజాయితీపరులు, రుణాలు కట్టలేక బ్యాంకు ముందు
తలదించుకోలేక ప్రాణాలు తీసుకునే రైతన్నలు,
బ్యాంక్ లోన్స్ అంటేనే భయపడి నిత్యం ఆర్థిక
కష్టాలను అనుభవిస్తున్న మధ్య తరగతి
భారతీయులు.

-కార్తిక్ నాగ